టన్ను చీనీ రూ.20,540

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.20,540, కనిష్టంగా రూ.8 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

కిలో టమాట రూ.10

కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.10 ధర పలికింది. మార్కెట్‌కు 270 టన్నుల టమాట అమ్మకానికి వచ్చింది.

గరిష్టం/కనిష్టం 35.2°/12.8°

జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. చలితీవ్రత తగ్గగా.. ఎండలు క్రమంగా పెరుగుతున్నాయి. గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.



లేపాక్షి: అశేష భక్తజనం మధ్య సాగుతున్న వీరభద్రస్వామి బ్రహ్మరథోత్సవం, (ఇన్‌సెట్) అలంకరణలో వీరభద్రస్వామి

నయనానందం

- వైభవంగా లేపాక్షి వీరభద్రస్వామి బ్రహ్మరథోత్సవం
- వీరనారాయణస్వామి పరుషతో ముదిగుబ్బలో సందడి

లేపాక్షి/ ముదిగుబ్బ: జిల్లాలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. పర్యాటక కేంద్రమైన లేపాక్షిలో వీరభద్రస్వామి బ్రహ్మ రథోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా శివపార్వతులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆ తర్వాత స్వామివార్లను రథంపై కొలువు దీర్చి పూజలు చేశారు. అనంతరం అశేష భక్తజనం మధ్య రథోత్సవాన్ని నిర్వహించారు. శివనామస్మరణతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. మరోవైపు ముదిగుబ్బ మండలం సంకేపల్లి వద్ద జరిగిన వీరనారాయణస్వామి పరుష ఘనంగా జరిగింది. ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లను స్వామి వారి ఆలయం చుట్టూ తిప్పి రైతులు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసిపోయింది.



ముదిగుబ్బ: అలంకరణలో వీరనారాయణస్వామి



ముదిగుబ్బ: ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లను ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయిస్తున్న రైతులు

న్యూస్‌రీల్

క్వింటా చింతపండు రూ.30 వేలు



మార్కెట్‌కు వచ్చిన చింతపండు

హిందూపురం అర్బన్: క్వింటా చింతపండు గరిష్టంగా రూ.30 వేలు పలికింది. స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు గురువారం 950 క్వింటాళ్ల చింతపండు రాగా, అధికారులు ఈ–నామ్ పద్ధతిలో వేలం పాటలు నిర్వహించారు. ఇందులో కలిపురి రకం క్వింటా గరిష్టంగా రూ.30 వేలు, కనిష్టంగా రూ.8 వేలు, సగటున రూ.12 వేలు పలికింది. అలాగే ఫ్లవర్ రకం క్వింటా గరిష్టంగా రూ.13 వేలు, కనిష్టంగా రూ.4,300, సగటున రూ. 6 వేల ప్రకారం ధర పలికినట్లు మార్కెట్ కార్యదర్శి జి. చంద్రమౌళి తెలిపారు. ఇక బోటు రకం చింతపండు క్వింటా గరిష్టంగా రూ.4 వేలు, కనిష్టంగా రూ.3500 పలికింది.

నేడు జాబ్ మేళా



మడకశిర: పట్టణంలోని ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు సంయుక్త ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమో, పీజీ పూర్తి చేసుకున్న నిరుద్యోగులు జాబ్‌మేళాలో పాల్గొనాలని సూచించారు. అభ్యర్థులకు 18 నుంచి 35 సంవత్సరాల్లోపు వయసు ఉండాలన్నారు. మూడు కంపెనీల ప్రతినిధులు జాబ్‌మేళాలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన యువతీ యువకులు పెనుకొండ, హిందూపురం, అనంతపురం, బెంగళూరు, హైదరాబాద్‌లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు అవసరమైన అన్ని విద్యార్హత సర్టిఫికెట్లు, బయోడేటా, ఆధార్ తదితర వాటితో జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

రొళ్ల: జాతీయస్థాయి షూటింగ్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు స్థానిక బీఆర్ అంబేడ్కర్ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా కేంద్రంలో మార్చి 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకూ జరిగే 4వ సౌత్‌జోన్ జాతీయస్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన 9వ తరగతి చదువుతున్న పృథ్వీ, తిలక్‌లు పాల్గొంటున్నట్లు పీడీ చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పాఠశాల చైర్మన్ సుమ, పీఈటీ వెంకటనారాయణ, ఉపాధ్యాయ బృందంతో పాటు తోటి విద్యార్థులు అభినందించారు.

పల్లకీలో ఊరేగిన సిద్ధేశ్వరుడు



సిద్ధేశ్వరస్వామిని పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం

అమరాపురం: హేమావతిలో సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం భాను పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి అర్చకులు వివిధ రకాల అభిషేకాలు, పూజలు చేశారు. శుక్రవారం నిర్వహించే అగ్నిగుండ మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ నరసింహరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ కరేగౌడ తెలిపారు.

ఎన్నికలకు ముందు 'సూపర్‌సిక్స్' పేరుతో కరపత్రాలు తీసుకుని ఇంటింటికీ వెళ్లారు. అధికారంలోకి వస్తే అంత చేస్తాం.. ఇంత చేస్తాం అని చెప్పారు. ఎలాగోలా గెలిచి, పదవులు కూడా చేపట్టారు.. కానీ ప్రజలనే మరిచిపోయారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రుల వద్దనే కీలక శాఖలున్నా కనీస కనికరం చూపడం లేదు. పంటలకు గిట్టుబాటు ధర లేదు, ఆస్పత్రుల్లో మందులు లేవు, హాస్టళ్లలో అధ్వాన్న భోజనం.. చెప్పుకుంటూ వెళితే శాఖల పరిధిలోనే సమస్యలు విలయతాండవం చేస్తున్నా పట్టించుకోవడమే లేదు. అయితే, శాసనసభలో శుక్రవారం బడ్జెట్ ప్రవేశపెడుతుండటం.. ఆర్థిక శాఖ మంత్రి ఉమ్మడి జిల్లా నుంచే ప్రాతినిథ్యం వహిస్తున్న నేపథ్యంలో ఈ సారైనా పట్టించుకుంటారా? లేక ఎప్పటిలాగే అరచేతిలో వైకుంఠం చూపి మమ అనిపిస్తారా అని ఉమ్మడి జిల్లా ప్రజలు చర్చించుకుంటున్నారు.



ఆదుకోండి అమాత్యా

- ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు
- జిల్లాకు ప్రయోజనం శూన్యం
- ఫీజు రీయింబర్స్‌మెంట్ అతీగతీ లేదు
- ఆస్పత్రుల్లో మందుల్లేక అల్లాడుతున్న రోగులు
- నేడు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న మంత్రి పయ్యావుల
- ఇప్పటికైనా మేలు చేస్తారని ప్రజల ఎదురు చూపులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: కూటమి సర్కారు కొలువుదీరి తొమ్మిది నెలలవుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి 14 మంది 'కూటమి' ఎమ్మెల్యేలే ఉన్నారు. కేబినెట్‌లో ముగ్గురు మంత్రులు ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. ఉరవకొండ నుంచి గెలుపొందిన పయ్యావుల కేశవ్ ఆర్థిక మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అనంతపురంలో ఫిబ్రవరి 5న నిర్వహించిన హార్టికల్చర్ కాంక్లేవ్‌లో ప్రసంగించిన ఆయన.. 'హంద్రీ–నీవా కాల్వ వెడల్పు పనులు చేస్తాం..రైతులు మీసం మెలేసేలా చేస్తాం' అని ఆయన ప్రకటించారు. కానీ లైనింగ్ పనులు చేస్తూ ఉమ్మడి జిల్లాను ఎడారిగా చేసేందుకు యత్నిస్తున్నారు. ఇప్పటివరకూ 'తల్లికి వందనం' లేక లక్షల మంది తల్లులు ఎదురు చూస్తున్నారు. ఏడాదికి రూ.20 వేల చొప్పున ఇస్తామన్న రైతు సాయం లేదు. కందికి మద్దతు ధర లేదు. టమాటకు గిట్టుబాటు ధర లభించడం లేదు. 9 నెలలైనా బీటీపీ ప్రాజెక్టు అతీ గతీ లేదు. వేసవికి ముందే తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. ఆయా సమస్యల పరిష్కారానికి బడ్జెట్‌లోనైనా కనికరం చూపిస్తారేమోనని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

సత్తెన్నా.. ఏందన్నా

చివరి నిమిషంలో పోటీ చేసి గెలిచి అదృష్టం కొద్దీ పదవి దక్కించుకున్న సత్యకుమార్ యాదవ్ జిల్లాకు ఎప్పుడొస్తారో.. ఎక్కడుంటారో తెలియని పరిస్థితి. కీలకమైన ఆరోగ్యశాఖను ఆయన నిర్వహిస్తున్నారు. అయితే, సత్యకుమార్ ప్రాతినిథ్యం వహిస్తున్న ధర్మవరం ఏరియా ఆస్పత్రిలోనే మందులు లేవు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పీహెచ్‌సీ నుంచి సర్వజనాసుపత్రి వరకూ మందుల కొరత వేధిస్తోంది. బయటకు చిట్టీలు రాస్తుంటే రోగులు అల్లాడిపోతున్నారు. పడుకోవడానికి పడకలు లేవు. రోగులకు సరైన భోజనం లేదు. పెనుకొండలో మెడికల్ కాలేజీ పనులను ఆపేశారు. అనంతపురంలో ఎంసీహెచ్ బ్లాకుకు కేటాయించిన నిధులు భారీగా తగ్గించారు. మానసిక రోగులకు, డయాబెటిక్ రోగులకు మందులు లేవు. బడ్జెట్ నేపథ్యంలో 'సత్తెన్నా.. గెలిపించిన జిల్లాకు కాసింత మేలు చేయన్నా' అని ప్రజలు అంటున్నారు.

సవితమ్మా.. ఇటు చూడమ్మా

పెనుకొండ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన సవిత బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టినా తమకు ఒరిగిందేమీ లేదని ఉమ్మడి జిల్లాలో అత్యధిక శాతం ఉన్న బడుగు బలహీన వర్గాలు అంటున్నాయి. ప్రభుత్వం ఫీజు రీయింబర్సుమెంటు నిధులు విడుదల చేయకపోవడంతో వేలాదిమంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందని దుస్థితి నెలకొంది. విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగినా పట్టించుకోవడం లేదు. బీసీ హాస్టళ్లలో అధ్వాన భోజనంతో పేద పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఫీజుల కోసం వేధిస్తున్నారనే ఒత్తిడితో నారాయణ కళాశాల విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ క్రమంలో 'మంత్రి సవితమ్మా.. కనీసం జిల్లాకైనా మేలు చేయమ్మా' అని కోరుతున్నారు.

'అన్నదాత సుఖీభవ'కు అర్హులు	5,50,000
'తల్లికి వందనం' అర్హులు	3,66,000
ఫీజురీయింబర్స్‌మెంట్ కోసం ఎదురు చేస్తున్న విద్యార్థుల సంఖ్య	80,000 వరకు

జిల్లా అభివృద్ధికి కృషి చేయాలి

అలివిగాని హామీలతో కూటమి అధికారంలోకి వచ్చింది. 9 నెలల పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు. తల్లికి వందనం, నిరుద్యోగులకు ఉపాధి, అన్నదాత సుఖీభవ తదితర పథకాలను అమలు చేయకుండా ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడేలా చేశారు. బడ్జెట్‌లో జిల్లాకు మేలు చేసేలా మంత్రులు, ప్రజాప్రతినిధులు కృషిచేయాలి. అన్నదాత సుఖీభవను విడుదల చేయడంతో పంటకు పరిహారం చెల్లించేలా నిధులు కేటాయించాలి.

– ఉషశ్రీ చరణ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు

పోసాని అరెస్ట్ దుర్మార్గం



మాట్లాడుతున్న టీఎన్ దీపిక

చిలమత్తూరు: సినీనటుడు పోసాని కృష్ణమురళి అరెస్టు దుర్మార్గమని హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక మండిపడ్డారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు డమ్మీ సీఎం అని, రెడ్‌బుక్ అమలు కోసం మంత్రి లోకేష్ రాష్ట్రాన్ని తన గుప్పిట్లో పెట్టుకున్నాడని విమర్శించారు. మంత్రి లోకేష్ పిల్ల చేష్టలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయస్థానాలు చెప్పినా తన తీరే తనదన్నట్లు వయసుతో సంబంధం లేకుండా అక్రమ అరెస్టులు చేయిస్తున్నారన్నారు. పోలీసులు సైతం లోకేష్ చెప్పినట్లు ఆడుతున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం శాశ్వతంగా ఉండదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు.

3 నుంచి ఓపెన్ ఇంటర్ పరీక్షలు

పుట్టపర్తి టౌన్: సార్వత్రిక విద్యాపీఠం నిర్వహించే ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 3వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు డీఈఓ క్రిష్టప్ప ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాలు ఉన్న పాఠశాలలను మధ్యాహ్నం వేళలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. అభ్యాసకులు https://www.apopenschool.ap.gov.in నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలుంటే సెల్ నంబర్: 9492588343ను సంప్రదించాలన్నారు.

వాణిజ్య పన్నులశాఖ ఇన్‌చార్జ్ సీటీఓగా మురళీమనోహర్

హిందూపురం అర్బన్: హిందూపురం వాణిజ్య పన్నులశాఖ సీటీఓగా మురళీ మనోహర్‌కు తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. అలాగే డీసీటీఓలుగా హిందూపురంలో విధులు నిర్వహిస్తున్న ఏసీటీఓ చంద్రశేఖర్, పుట్టపర్తి సర్కిల్‌లోని డీసీటీఓ సురేష్‌కుమార్, ఏసీటీఓ అనిల్‌కుమార్‌లకు ఉన్నతాధికారులు తాత్కాలిక బాధ్యతలు అప్పజెప్పారు. హిందూపురం వాణిజ్య పన్నులశాఖ కార్యాలయంలో వివిధ ఆరోపణలతో సీటీఓతో పాటు ముగ్గురు డీసీటీఓలను మంగళవారం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

కాటికోటేశ్వరం.. ముగిసిన ఉత్సవం



చిల్లవారిపల్లి కాటికోటేశ్వరస్వామి గుర్రాలను ఊరేగిస్తున్న దృశ్యం



చిల్లవారిపల్లిలో పరిస్థితిని సమీక్షిస్తున్న కలెక్టర్ చేతన్ ఎస్పీ రత్న

- గుడికట్టుదారుల మధ్య వివాదం
- భారీగా తగ్గిన భక్తజనం
- తూతూమంత్రంగా ఉత్సవాలు

సాక్షిటాస్క్‌ఫోర్స్: ప్రతి ఏడాది ఎంతో వైభవంగా జరిగే కాటికోటేశ్వరస్వామి ఉత్సవాలు ఈసారి తూతూ మంత్రంగా ముగించారు. గుడికట్టుదారుల మధ్య వివాదం నెలకొనడంతో భక్తులు కూడా అమాంతం తగ్గిపోయారు. కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న పర్యవేక్షణలో దేవాదయశాఖ అధికారుల ఆధ్వర్యంలో ఉత్సవాలు నామమాత్రంగానే ముగిశాయి.

రాజకీయ జోక్యంతోనే వివాదం..

ఆలయ ఉత్సవాల నిర్వహణలో తెలుగుదేశం పార్టీల నాయకులు జోక్యం చేసుకోవడంతో దేవాదయశాఖ అధికారులు, పోలీసులు వారి ఒత్తిళ్లకు తలొగ్గారు. ఇందులో భాగంగానే అప్పటి వరకూ ఉన్న బ్రాహ్మణ ఆలయ పూజారిని బుధవారం తొలగించి చిల్లవారిపల్లికి చెందిన వ్యక్తిని పూజారిని చేశారు. దీంతో చిల్లవారిపల్లి గ్రామస్తులు అధికారుల తీరును వ్యతిరేకించారు. పూజారి వ్యవహారంపై కోర్టులో కేసు నడుస్తుండటంతో ఇరువర్గాల వారిని కాదని బ్రాహ్మణ వ్యక్తిని పూజారిగా నియమించి ఆలయం, ఉత్సవాలు నిర్వహణ చేస్తుండగా ఉన్నఫలంగా పూజారిని మార్చడం ఏమిటని చిల్లవారిపల్లి గ్రామస్తులు అధికారుల తీరును ప్రశ్నించారు. పూజారిని మార్చి బ్రాహ్మణ పూజారిని నియమిస్తేనే ఉత్సవాల్లో పాల్గొంటామని లేకపోతే గుర్రాలు ఇవ్వమని తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలో ఆర్డీఓ, డీఎస్పీలు వందలాది మంది పోలీసులతో బుధవారం సాయంత్రం చిల్లవారిపల్లికి వెళ్లి స్వామికి సంబంధించిన వెండి గుర్రాలు తీసుకునేందుకు ఆలయానికి ఉన్న తాళాలు బద్దలు కొట్టి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ ప్రయత్నాలను గ్రామస్తులంతా ఐక్యంగా అడ్డుకున్నారు. ఆలయ పూజారి గంగిరెడ్డిగారి మంజునాథ్‌రెడ్డి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. అలాగే గాలిమిషన్ శంకర్‌రెడ్డి, ఆంధ్ర వెంకటరామిరెడ్డి, పిరియాల కిష్టయ్య అనే యువకులు ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకునే యత్నం చేశారు. దీంతో అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. తర్వాత కలెక్టర్, ఎస్పీలు కాటికోటేశ్వరస్వామి క్షేత్రానికి వెళ్లి చిల్లవారిపల్లి గ్రామస్తులతో రాజీమార్గానికి ప్రయత్నించారు. గతంలో భక్తులు చేయించిన రెండు గుర్రాలను ఇస్తే ఉత్సవాలు నిర్వహణ పూర్తయిన వెంటనే వెనక్కి ఇచ్చేస్తామని చెప్పి వెండి గుర్రాలను తీసుకెళ్లారు. ఉత్సవాల్లో చిల్లవారిపల్లి గ్రామస్తుల ప్రమేయం తగ్గించడంతో గ్రామస్తులు ఉత్సవాలకు దూరమయ్యారు. ఈ ఘటనల నేపథ్యంలో బయట నుంచి వచ్చే భక్తుల సంఖ్య కూడా తగ్గిపోయింది.

ముగిసిన ఉత్సవాలు..

కాటికోటేశ్వరస్వామి స్వామిని గురువారం రాత్రి గ్రామంలో భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. గదా గుండం సమీపంలో కొలువుదీరిన స్వామి వెండి గుర్రాలను డప్పులు, ఉరుముల వాయిద్యాలతో ఆలయం వరకూ ఊరేగించారు. భక్తులు స్వామికి నీళ్లు ఆరబోసి, కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ నరసింహరాజు, ఆర్డీఓ మహేష్, డీఎస్పీ హేమంత్‌కుమార్‌లు ఉత్సవాలను పర్యవేక్షించారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ టీఎస్ చేతన్



భూసేకరణ పెండింగ్ పనులపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ చేతన్

ప్రశాంతి నిలయం: జిల్లాలోని వివిధ ప్రాంతాలలో చేపట్టిన భూసేకరణకు సంబంధించిన అన్ని పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో ఎన్‌హెచ్ 342, ఎన్‌హెచ్ 716జీతో పాటు భూసేకరణ సంబంధించిన పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జాతీయ రహదారులకు సంబంధించి సేకరించిన భూయజమానులకు నష్టపరిహారం చెల్లింపు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. త్వరితగతిన పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రతిపాదనలు భూసేకరణ విభాగం కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు. కార్యక్రమంలో భూసేకరణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ , కదిరి, పుట్టపర్తి, పెనుకొండ, ధర్మవరం ఆర్డీఓలు శర్మ, సువర్ణ, ఆనంద్ కుమార్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు...

జిల్లాలో పరిశ్రమల స్థాపన కోసం భూ సేకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో రైల్వే నిర్మాణ పనులు, ఏపీఐఐసీ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటుపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మడకశిర నియోజకవర్గంలోని ఆర్.అనంతపురం, గొడసేహళ్లిలో పరిశ్రమల ఏర్పాటుకు స్థల సేకరణ చేపడుతున్నట్లు చెప్పారు. 38 ఎకరాలు సేకరించనున్నట్లు పేర్కొన్నారు. డీఆర్‌ఓ విజయ సారథి, పరిశ్రమలశాఖ జోనల్ మేనేజర్ సోనీ సహానీతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పడిపోతున్న సిబిల్!





☛ హిందూపురానికి చెందిన కరీముల్లా ఆర్నెళ్ల క్రితం రూ.లక్ష విలువ చేసే ఫర్నీచర్‌ను ఓ ప్రైవేటు సంస్థ ద్వారా ప్రతి నెలా రూ.5 వేలు చెల్లించేలా ఒప్పందంపై కొనుగోలు చేశాడు. తొలి నాలుగు నెలలు సజావుగానే ఈఎంఐ చెల్లించాడు. ఆ తర్వాత అతడు చేస్తున్న చిరుద్యోగం కాస్త ఊడిపోయింది. దీంతో కంతులు చెల్లించడంలో జాప్యం నెలకొంది. ఫలితంగా ఆర్నెళ్ల తర్వాత చూసుకుంటే ఆయన సిబిల్ స్కోరు ఒక్కసారిగా 300కు పడిపోయింది.

☛ పుట్టపర్తికి చెందిన చిరు వ్యాపారి కృష్ణసాయి తన అవసరాల నిమిత్తం ఓ బ్యాంకులో వ్యక్తిగత రుణం తీసుకున్నాడు. అనివార్య కారణాలతో వ్యాపారం తీసేయాల్సి వచ్చింది. దీంతో నెలవారీ కంతులు చెల్లించడంలో ఇబ్బందులు నెలకొని సిబిల్ స్కోరు 200కు పడిపోయింది. ఆ తర్వాత ఎన్ని బ్యాంకుల్లో ప్రయత్నించినా.. కొత్త రుణం ఆయనకు పుట్టలేదు.

.... ఇప్పట్లో సిబిల్ స్కోరుకు పెరిగిన ప్రాధాన్యతకు ఈ ఘటనలు ఓ ఉదాహరణ మాత్రమే. ఆర్థిక నియంత్రణ కోల్పోతే భవిష్యత్తు కష్టమని ఆర్థిక నిపుణులు కూడా హెచ్చరిస్తున్నారు.

- ఈఎంఐ లు చెల్లించలేక వినియోగదారుల అవస్థలు
- భవిష్యత్తులో నగదు సహిత రుణాలకూ ఇబ్బందులు
- ఆర్థిక నియంత్రణ లేకపోతే భవిష్యత్ కష్టమంటున్న నిపుణులు

సాక్షి, పుట్టపర్తి: ఎవరైనా వ్యక్తి ఆర్థిక చరిత్రకు అద్దం పట్టేది క్రెడిట్ స్కోరు. ఇక్కడ తీసుకున్న లోన్లు.. చెల్లింపుల తీరు.. క్రెడిట్ కార్డుల వినియోగం.. అప్పుల కోసం ఎన్ని సార్లు ప్రయత్నించారు. గతంలో ఏమైనా లోన్లు ఎగ్గొట్టారా.. ఇప్పటికీ ఈఎంఐ కడుతున్నారా.. ఇలా అన్ని విషయాలు తెలుసుకోవచ్చు. ఈ క్రెడిట్ రిపోర్టుతో వ్యక్తి ఆర్థిక క్రమశిక్షణ ఏపాటిదో సులువుగా తెలుసుకోవచ్చు. ఆర్థిక నియంత్రణ క్రమశిక్షణ లేకపోవడం కారణంగా చాలామంది చిరుద్యోగులు, చిరు వ్యాపారులు భారీ మూల్యం చెల్లించుకుంటున్నారు.

అప్పు చేసి విలాసాలు..

పులిని చూసి నక్క వాత పెట్టుకున్న చందంగా మారింది ప్రస్తుతం మధ్య తరగతి ప్రజల పరిస్థితి. తమ చుట్టుపక్కల వారు ఏదైనా వస్తువు కొనుగోలు చేస్తే తమ ఇంట్లోనే ఉండాలనే ఆకాంక్ష తప్పు కాదు. అయితే ఇందు కోసం అప్పు చేసి ఆ తర్వాత రుణాలు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయి లేని తలనొప్పులు తెచ్చుకుంటున్నారు. చిన్నపాటి లావాదేవీల విషయంగానే సిబిల్ స్కోరు పడిపోయి.. భవిష్యత్తులో బ్యాంకుల ద్వారా రుణాలు పొందే సదుపాయాన్ని కోల్పోతున్న వారి సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. మధ్య తరగతి ప్రజల అవసరాలను తెలివిగా ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలు సొమ్ము చేసుకుంటున్నాయి. ఆఫర్ల పేరుతో రుణాల ఎర వేసి ఆకట్టుకుంటున్నారు. అయితే రుణం తీసుకునే సమయంలో సరైన ప్లానింగ్ లేకపోవడంతో నెలవారీ కంతులు చెల్లించడంలో జాప్యం చోటు చేసుకుని భారీగా నష్టపోతున్నారు. ఆర్థిక క్రమశిక్షణ, అవగాహన లేకుంటే ప్రమాదకర స్థాయికి చేరుకునే అవకాశముందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

సిబిల్ స్కోరు	700 పైగా ఉంటే బెటర్
జిల్లాలో రుణ గ్రహీతలు	2 లక్షల మంది
ప్రస్తుత డిఫాల్టర్ల సంఖ్య	20 వేలకు పైగా
రుణాలు ఎందుకంటే	మొబైల్, టీవీ, ఫర్నీచర్ కొనుగోలుకే అధికం

పెరిగిపోతున్న డిఫాల్టర్లు..

జిల్లా వ్యాప్తంగా రకరకాల ప్రైవేటు సంస్థల ద్వారా రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించలేని స్థితిలో చాలా మంది డిఫాల్టర్లుగా మారిపోతున్నారు. ఇటీవల వీరి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. మొబైల్ ఫోన్లు, వాషింగ్ మెషీన్లు, టీవీలు, ఫ్రిజ్‌లు, ఫర్నీచర్లు... తదితరాలను కొనుగోలు చేసిన వారే ఎక్కువ మంది డిఫాల్టర్లుగా మారినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. సాధారణంగా సిబిల్ స్కోరు 650 దాటితే ఏవైనా రుణాలొస్తాయి. కానీ తీసుకున్న రుణం సక్రమంగా చెల్లించకపోవడంతో ప్రతి పది మందిలో ఇద్దరు డిఫాల్టర్లుగా మారుతున్నారు.

సున్నా వడ్డీతో ఆకర్షిస్తూ..

పలు ఫైనాన్స్ కంపెనీలు జీరో ప్రాసెసింగ్, సున్నా వడ్డీ అంటూ ఇచ్చే ప్రకటనలతో చాలామంది వినియోగదారులు మోసపోతున్నారు. ఎలాంటి వడ్డీ లేకుండా, ప్రాసెసింగ్ ఫీజు లేకుండా వస్తువుకు డబ్బు కట్టి, పది నెలలు మనతో రీపేమెంట్ ఎందుకు చేసుకుంటాయనే లోగుట్టును చాలా మంది అర్థం చేసుకోలేకపోతున్నారు. ఓ కంపెనీ ఎలాంటి లాభాపేక్ష లేకుండా జీరో ప్రాతిపదికన రుణం ఎందుకు ఇస్తుందనే విషయాన్ని వినియోగదారులు ఆలోచించాలని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఉంటే ఉత్తమమని సూచిస్తున్నారు.

సిబిల్ స్కోరు కీలకం



ప్రస్తుత పరిస్థితుల్లో సిబిల్ స్కోరు చాలా కీలకంగా మారింది. చిన్నపాటి అప్పుల సమాచారాన్ని సైతం ఆయా ఫైనాన్స్ సంస్థలు సిబిల్‌కు తెలియజేస్తాయి. చెల్లింపుల్లో జాప్యం లేదా మొండి బకాయిలు.. ఇలా రకరకాల కారణంగా చాలామందికి సిబిల్ స్కోరు లేక బ్యాంకుల్లో రుణాలు అందడం లేదు. వస్తువు తీసుకున్నాక సకాలంలో చెల్లింపులు చేయకపోతే భవిష్యత్తులో పరపతి లభించడం చాలా కష్టం. – రాధాకృష్ణారెడ్డి, ఆడిటర్, పుట్టపర్తి

ఎంపీపీ ఆది సెక్యూరిటీ దౌర్జన్యకాండ

- టెంకాయల విక్రయదారుడిపై దాడి

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ (బీజేపీ) అనుచరుల ఆగడాలకు అంతులేకుండా పోయాయి. తాజాగా ఎంపీపీకి ప్రైవేటు సెక్యూరిటీగా ఉన్న ఉపేంద్ర అనే వ్యక్తి ఓ చిరు వ్యాపారిపై ప్రతాపం చూపాడు. డబ్బులివ్వలేదన్న కారణంతో దాడి చేసి గాయపరిచాడు. ఈ ఘటన గురువారం వీరనారాయణస్వామి పరుషలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... పరుషలో టెంకాయలు విక్రయించేందుకు వేలంపాట నిర్వహించగా.. మల్లికార్జున అనే వ్యక్తి దక్కించుకున్నాడు. సాయంత్రం ఎంపీపీ ప్రైవేటు సెక్యూరిటీ ఉపేంద్ర టెంకాయల వ్యాపారి మల్లికార్జునను డబ్బులు డిమాండ్ చేశాడు. తాను ఎందుకు డబ్బులివ్వాలని ప్రశ్నించగా...ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలోనే ఎంపీపీ సెక్యూరిటీ ఉపేంద్ర తీవ్ర ఆవేశంతో మల్లికార్జునపై దాడి చేశాడు. ఈ ఘటనపై మల్లికార్జున భార్య నీలాంబిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు విచారణ చేస్తున్నారు.

దారి దోపిడీకి యత్నించిన చైన్ స్నాచర్లు

- ద్విచక్ర వాహనం నుంచి కిందపడి గాయపడిన దంపతులు, చిన్నారి

కనగానపల్లి: మండలంలోని మామిళ్లపల్లి – ధర్మవరం రహదారిలో గురువారం మధ్యాహ్నం చైన్ స్నాచర్లు దారి దోపిడీకి యత్నించారు. వివరాలు... ధర్మవరం పట్టణానికి చెందిన నారాయణస్వామి, అమని దంపతులు తమ కుమార్తెతో కలసి ద్విచక్ర వాహనంపై గురువారం మామిళ్లపల్లికి బయలుదేరారు. మరికొద్ది సేపటికి మామిళ్లపల్లికి చేరుకుంటారనుకుంటుండగా ఎదురుగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు ఆగంతకుల్లో ఒకరు... అమని మెడలోని బంగారు గొలుసును లాగేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో గొలుసు తెగకపోవడంతో అమనితో పాటు భర్త, కుమార్తె కిందపడ్డారు. ఇంతలో ఆ మార్గంలో వాహనదారులు వస్తుండడం గమనించి దుండగులు అక్కడి నుంచి ఉడాయించారు. గాయపడిన దంపతులు, చిన్నారిని స్థానికులు వెంటనే ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా, ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.


గాయపడిన నారాయణస్వామి

జూనియర్ అసిస్టెంట్‌పై ఉపాధ్యాయుడి దాడి

తనకల్లు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ రాజేష్‌పై ఉపాధ్యాయుడు లక్ష్మీప్రసాద్ దాడి చేశాడు. పోలసులు తెలిపిన మేరకు... మెడికల్, ఇన్‌కంట్యాక్స్ బిల్లుల విషయంలో జూనియర్ అసిస్టెంట్ రాజేష్‌కు మండ్లిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు లక్ష్మీప్రసాద్ మధ్య స్థానిక ఎమ్మార్సీలో గురువారం వాగ్వాదం చోటు చేసుకుంది. ఆ సమయంలో అసహనానికి గురైన ఉపాధ్యాయుడు లక్ష్మీప్రసాద్... రాజేష్‌ ముఖంపై బలంగా గుద్దారు. దీంతో అయన పెదవికి గాయమైంది. గమనించిన తోటి ఉద్యోగులు రాజేష్‌ను చికిత్స కోసం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తనపై భౌతిక దాడికి పాల్పడిన ఉపాధ్యాయుడిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ రెడ్డెప్ప, ఎంఈఓ లలితమ్మకు రాజేష్ ఫిర్యాదు చేశాడు. కాగా అకారణంగా తనపై జూనియర్ అసిస్టెంట్ రాజేష్ దాడి చేసినట్లు ఉపాధ్యాయుడు లక్ష్మీప్రసాద్ కూడా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై ఏఎస్ఐ రామసుబ్బయ్యను వివరణ కోరగా... ఇరువురు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేశారని, ఘటనపై విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు.

కూలిన కల్వర్టు... మహిళా కూలీ మృతి


అనురాధ (ఫైల్)


ఓడీచెరువు: పని ప్రాంతంలో నిలువురాళ్లు మీద పడడంతో ఓ మహిళా కూలీ దుర్మరణం పాలైంది. స్థానికులు తెలిపిన మేరకు... ఓడీ చెరువు మండలం ఇనగలూరు బస్‌స్టాప్ ఉన్న కోళ్లఫారం ఆవరణలో కల్వర్టు పనులు జరుగుతున్నాయి. ఈ పనుల్లో భర్త వెంకటేష్‌తో కలసి భార్య అనురాధ (45) పాల్గొంది. మధ్యాహ్నం కల్వర్టు కింద నీడలో ఉంచిన వాటర్ బాటిల్‌ను తీసుకునేందుకు అనురాధ వెళ్లింది. ఆ సమయంలో ఉన్నఫలంగా కల్వర్టు కుప్పకూలింది. రాతి కప్పుల (నిలువురాళ్లు) కింద అనురాధ కూరుకుపోయింది. విషయాన్ని గమనించిన భర్త వెంకటేష్ కేకలు వేయడంతో అక్కడకు చేరుకున్న పలువురు రాతి కప్పులను తొలగించడానికి ప్రయత్నించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ మల్లికార్జునరెడ్డి అక్కడకు చేరుకుని యంత్రాల సాయంతో రాతికప్పులు తొలగించారు. అప్పటికే అనురాధ మృతి చెందింది. మృతిరాలికి ఓ కుమారుడు, ఓ కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న మృతిరాలి బంధువులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని బోరున విలపించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలంటేఊ కదిరి–హిందూపురం రహదారిపై మృతదేహంతో ఆందోళన చేపట్టారు. నాసిరకం రాతి కప్పులతో కల్వర్టు నిర్మించిన కోళ్ల ఫారం యజమాని నరసింహులుపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు.


‘సహజీవనం చేయాలని వేధిస్తున్నాడు’

కదిరి టౌన్: ఇష్టం ఉన్నా.. లేకున్నా సహజీవనం చేయాల్సిందేనంటూ కదిరికి చెందిన రామాంజినేయులు వేధిస్తున్నాడని బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. సీఐ నారాయణరెడ్డి తెలిపిన మేరకు... కదిరిలో టైలరింగ్‌తో జీవనం సాగిస్తున్న ఓ మహిళ గతంలో రామాంజినేయులుతో సహజీవనం చేస్తుండేది. ఈ నేపథ్యంలో ఇద్దరి మనస్పర్థలు చెలరేగడంతో కొన్ని రోజులుగా రామాంజినేయులుకు దూరంగా ఆమె ఉంటూ వచ్చింది. బుధవారం రాత్రి మద్యం మత్తులో మహిళ ఇంటి వద్దకు చేరుకున్న రామాంజినేయులు ఆమెను దుర్భాషలాడుతూ తనతో సహజీవనం చేయకపోతే అంతు చూస్తానని బెదిరిస్తూ భయభ్రాంతులకు గురి చేశాడు. ఘటనపై బాధితురాలి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వేడుకలకు వెళ్తూ.. పర లోకాలకు!

- గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరి మృతి


చరణ్


తిరుమలేష్ (ఫైల్)

పావగడ: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు... రొద్దం మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన స్నేహితులు భరత్, తిరుమలేష్, చరణ్ (ఐటీఐ విద్యార్థి), అజయ్, ప్రశాంత్, నవీన్ బుధవారం రాత్రి లేపాక్షిలో జరిగే మహాశివరాత్రి వేడుకల్లో పాల్గొనేందుకు ద్విచక్ర వాహనాలపై బయలుదేరారు. ఈ క్రమంలో గురువారం వేకువజాము 1 గంటకు పావగడ తాలూకా దొమ్మతమర్రి మీదుగా హిందూపురం మార్గంలోని యల్లగానగుట్ట వద్దకు చేరుకోగానే గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఘటనలో తిరుమలేష్ (20) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన తిప్పేస్వామి కుమారుడు చరణ్ (19)ను పావగడలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, ఇదే ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న భరత్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పావగడ సీఐ సురేష్ తెలిపారు.

రెడ్డిపల్లిలో విషాదఛాయలు

రొద్దం: చేతికి అందివచ్చిన కుమారులను రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబళించడంతో రొద్దం మండలం రెడ్డిపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబానికి ఆసరాగా ఉన్న కుమారులను కోల్పోయిన తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. రెడ్డిపల్లి గ్రామానికి చెందిన చరణ్, తిరుమలేసు కర్ణాటకలోని దొమ్మితిమర్రి గ్రామం వద్ద మృతి చెందిన విషయం తెలియగానే గ్రామం ఉలిక్కిపడింది. బాధిత కుటుంబసభ్యులతో పాటు పలువురు స్థానికులు హుటాహుటిన పావగడకు తరలి వెళ్లారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను గ్రామానికి తీసుకువచ్చారు. కురుబ రామాంజి ఒక్కగానొక్క కుమారుడు తిరుమలేసు కియా పరిశ్రమలో పనిచేస్తూ కుటుంబానికి చేదోడుగా నిలిచాడు. అలాగే కమలమ్మ, తిప్పేస్వామి దంపతులకు ఇద్దరు కుమారులుకాగా, పెద్దకుమారుడు చరణ్ మృతి చెందడంతో ఆ కుటుంబంలోనూ విషాదం నెలకొంది. విషయం తెలుసుకున్న పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు.

హేమావతి బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక బస్సులు

మడకశిర: అమరాపురం మండలంలోని హేమావతి వెలసిన సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించే అగ్నిగుండ మహోత్సవానికి ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు మడకశిర ఆర్టీసీ డీఎం రామసుబ్బయ్య తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. మడకశిర, అమరాపురం, గుడిబండ, రొళ్ల, అగళి, బసవనపల్లి తదితర ప్రాంతాల భక్తుల సౌకర్యార్థం 20 ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడపనున్నారు. అలాగే మార్చి 3న నిర్వహించే బ్రహ్మరథోత్సవానికి కూడా ప్రత్యేక బస్సుల సౌకర్యాన్ని కల్పించున్నారు.

పటిష్ట భద్రత..

హేమావతి సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం జరిగే అగ్నిగుండ మహోత్సవానికి భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు మడకశిర సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. బ్రహ్మోత్సవాలు ముగిసే వరకూ బందోబస్తు కొనసాగుతుందన్నారు.

ముగిసిన అఖండ భజన


అఖండ భజనలో పాల్గొన్న భక్తులు

ప్రశాంతి నిలయం: మహాశివరాత్రి సందర్భంగా బుధవారం సాయంత్రం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో చేపట్టిన అఖండ భజన గురువారం ఉదయం 6 గంటలకు ముగిసింది. దేశవిదేశాలకు చెందిన వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

తిమ్మమాంబ ఆలయానికి పోటెత్తిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో తిమ్మమాంబ మూలవిరాట్


పూజలందుకున్న బాలవీరయ్య, తిమ్మమాంబ

ఎన్‌పీకుంట: మండలంలోని తిమ్మమ్మ మర్రిమాను వద్ద గత మూడు రోజులుగా కొనసాగుతూ వచ్చిన మహాశివరాత్రి వేడుకలు గురువారం ముగిశాయి. బుధవారం మర్రిమాను వద్ద వెలసిన తిమ్మమాంబ ఆలయానికి భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. జాగారణ చేసిన భక్తులు ఉదయం అమ్మవారికి గంధాభిషేకం పూజల్లో పాల్గొనేందుకు బారులు తీరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ విష్ణుమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు నారాయణస్వామి, శ్రీనివాసులు, వెంకటనారాయణ, మనోహర్, అనిల్‌రాయల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దళితుడి సమాధి ధ్వంసం


సమాధిని ధ్వంసం చేసిన దృశ్యం

చెన్నేకొత్తపల్లి: మండలంలోని బసంపల్లిలో దళితుల (మాల)కు అదే గ్రామానికి చెందిన శంకరనారాయణ కుటుంబాల మధ్య కొన్నేళ్లుగా శ్మశాన స్థల వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలో ఏడాది క్రితం మృతి చెందిన నాగప్ప అనే వ్యక్తికి సమాధిని కుటుంబ సభ్యులు నిర్మించారు. గురువారం మృతుడి ఏడాది కర్మ కాండలు చేసేందుకు కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకోగా సమాధిపై భాగం ధ్వంసం చేసి ఉండడాన్ని గమనించారు. విషయాన్ని వారు కాలనీలోని పెద్దలకు తెలపడంతో వారు శ్మశాన స్థల వివాధం ఉన్న శంకరనారాయణ కుటుంబ సభ్యులతో మాట్లాడి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాధిని ధ్వంసం చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు.

యువకుడి దుర్మరణం

తనకల్లు: కర్ణాటక బస్సు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... కదిరి మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుళ్లకు చెందని విజయ్ (25), చైతన్య బెంగళూరులోని ఓ గోదాములో పనిచేస్తున్నారు. శివరాత్రి సందర్భంగా స్వగ్రామానికి వచ్చిన వారు బుధవారం రాత్రి అన్నమయ్య జిల్లాలోని మల్లయ్య కొండకు వెళ్లారు. దైవదర్శనం అనంతరం గురువారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన వారు... తనకల్లు మండలం చీకటిమానిపల్లి సమీపంలో 42వ జాతీయ రహదారిపై ప్రయాణిస్తుండగా ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన బళ్లారి నుంచి తిరుపతికి వెళుతున్న కర్ణాటక బస్సు ఢీకొంది. ప్రమాదంలో విజయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన చైతన్యను స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా కదిరిలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స కోసం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సర్వేలు పకడ్బందీగా నిర్వహించాలి


రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ ఫైరోజ్‌బేగం

ధర్మవరం అర్బన్: అర్బన్ హెల్త్ సెంటర్లకు వచ్చే రోగులకు సకాలంలో వైద్యసేవలు అందించాలని, అలాగే ప్రభుత్వం చేపట్టిన సర్వేలను పకడ్బందీగా నిర్వహించాలని డీఎంహెచ్ఓ ఫైరోజ్‌బేగం ఆదేశించారు. పట్టణంలోని దుర్గానగర్, సాయినగర్, కొత్తపేట, గాం.దీనగర్, శివానగర్లలోని అర్బన్ హెల్త్ సెంటర్లను గురువారం ఆమె తనిఖీ చేశారు. అర్బన్ హెల్త్ సెంటర్లలోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఓపీ సేవలకు సరిపడా మందులు ఉన్నాయో? లేదో తనిఖీ చేశారు.

అక్రిడిటేషన్ కాలపరిమితి పొడిగింపు

ప్రశాంతి నిలయం: రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టుల అక్రిడిటేషన్ కాలపరిమితిని మరో మూడు నెలలు పొడిగిస్తూ రాష్ట్ర పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో పొడిగించిన అక్రిడిటేషన్ కార్డుల గడువు ఫిబ్రవరి 28తో ముగియనుంది. ఫిబ్రవరి 28 నాటికి అక్రిడిటేషన్ కలిగిన వర్కింగ్ జర్నలిస్టులకు మాత్రమే మార్చి 1 నుంచి మే 31 వరకు పొడిగింపు వర్తిస్తుందని డీపీఆర్వో కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

రిమాండ్‌కు యువకుడు

అగళి: ప్రేమ పేరుతో బాలికను లోబర్చుకున్న వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు అగళి ఎస్ఐ వీరేష్ తెలిపారు. వివరాలు.. మండలంలోని ఓ గ్రామానికి మైనర్ బాలిక కనిపించకపోవడంతో తల్లి ఫిర్యాదు మేరకు ఈ నెల 14న పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో మడకశిరకు చెందిన మధు అనే యువకుడు బాలికను ప్రేమ పేరుతో నమ్మించి తన వెంట పిలుచుకెళ్లినట్లుగా గుర్తించారు. సెల్‌ఫోన్ లోకేషన్ ఆధారంగా వారు ఉంటున్న ప్రాంతానికి చేరుకుని బాలికను కాపాడి తల్లి వద్దకు చేర్చారు. అనంతరం బాధితుల ఫిర్యాదు మేరకు మధుపై పోక్సో కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

కట్నం వేధింపులపై కేసు నమోదు

కదిరి టౌన్: కట్నం వేధింపులపై కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. వివరాలను గురువారం ఆయన వెల్లడించారు. కదిరిలోని పార్థసారథి కాలనీకి చెందిన షేక్ షహరూన్‌కు నాలుగేళ్ల క్రితం కర్ణాటకలోని చిక్కబల్లాపురం జిల్లా బిల్లూరు గ్రామానికి చెందిన రిజ్వాన్‌తో వివాహమైంది. పెళ్లి సమయంలో ఎలాంటి కట్న కానుకలను రిజ్వాన్ ఆశించలేదు. అయితే కొన్ని రోజులుగా భర్తతో పాటు అత్త జరీన్, మామ మహమ్మద్ రఫీక్ రూ.2 లక్షలను కట్నంగా తీసుకురావాలంటూ వేధించసాగారు. వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో పుట్టింటికి చేరుకున్న షహరూన్ ఫిర్యాదు మేరకు రిజ్వాన్‌తో పాటు ఆయన తల్లిదండ్రులపై కట్నం వేధింపుల కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గొర్రెలపై దూసుకెళ్లిన ఐచర్

- 30 జీవాల మృతి

బత్తలపల్లి: స్థానిక జాతీయ రహదారిపై ఐచర్ వాహనం దూసుకెళ్లడంతో 30 గొర్రెలు మృతి చెందాయి. బాధిత కాపరి తెలిపిన మేరకు... ధర్మవరం మండలం తిప్పేపల్లి గ్రామానికి చెందిన నారాయణస్వామి... గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం బత్తలపల్లి మండలం తంబాపురం వద్ద మేపునకు వదిలిన ఆయన.. సాయంత్రం జాతీయ రహదారికి అవతలి వైపు ఉన్న నీటి కుంట వద్దకు తోలుతుండగా.... కదిరి నుంచి బత్తలపల్లి వైపుగా వేగంగా వెళుతున్న ఐచర్ వాహనం మందపైకి దూసుకెళ్లింది. ప్రమాదంలో 30 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో ఐదు గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా ఉడాయించాడు. అదే సమయంలో అటుగా వచ్చిన ఓ ద్విచక్ర వాహనదారుడి సాయంతో గుమ్మల్లకుంట సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద ఐచర్ వాహనాన్ని కాపరి నారాయణస్వామి అడ్డుకుని, పోలీసులకు అప్పగించాడు. ఘటనాస్థలాన్ని పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేశారు. ప్రమాదంలో జీవాలు మృతి చెందిన విషయాన్ని కాపరి తమ యజమానికి తెలియజేశాడు. దాదాపు రూ. 3 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

చోరీ కేసుల్లో ముద్దాయికి మూడేళ్ల జైలు

పుట్టపర్తి టౌన్: పలు బంగారు ఆభరణాల అపహరణ కేసుల్లో ముద్దాయి అమర్నాథ్‌నాయుడుకు మూడేళ్ల సాధారణ జైలు శిక్ష విధిస్తూ పుట్టపర్తి జీఎఫ్‌సీఎం కోర్టు గురువారం తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళితే.. జిల్లాలోని నల్లమాడ ప్రాంతంలో భీమినేని అమర్నాథ్‌నాయుడు 14 చోరీలకు పాల్పడ్డాడు. 2021 డిసెంబర్ 22న సీఐ ఇస్మాయిల్ 650 గ్రాముల బంగారాన్ని రికవరీ చేయడంతో పాటు ముద్దాయిని రిమాండ్‌కు తరలించారు. కేసులకు సంబంధించిన సాక్ష్యాలను పకడ్బందీగా కోర్టుకు సమర్పించారు. పోలీస్ వారి తరుపున ఏపీపీలు నగేష్, రాజేంద్రప్రసాద్ వాదనలు వినిపించారు. అనంతరం న్యాయమూర్తి రాఖేష్ .. ముద్దాయి అమర్నాథ్‌నాయుడుకు మూడు సంవత్సరాలు సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు. బాధితులను న్యాయం జరిగే విధంగా దర్యాప్తు చేపట్టిన సీఐ ఇస్మాయిల్‌ను, కోర్టు కానిస్టేబుల్ కృష్ణమాచారి, చంద్రానాయక్‌ను పలువురు ఉన్నతాధికారులు ప్రశంసించారు.

తల్లిదండ్రులపై కొడుకుల దాడి

కదిరి టౌన్: స్థానిక గజ్జలరెడ్డిపల్లిలో నివాసముంటున్న వృద్ధ దంపతులు చల్లా నారమ్మ, చల్లా జయరాములుపై కుమారులు రమణ, చంద్రశేఖర్ దాడి చేసి గాయపరిచారు. ఆస్తి తగాదాలే దాడికి కారణంగా తెలిసింది. బాధిత దంపతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బావిలో యువతి మృతదేహం

మడకశిర రూరల్: మండల పరిధిలోని గౌరిపురం గ్రామానికి చెందిన గంగరత్నమ్మ (25) మృతదేహాన్ని గురువారం కసుమ మారెమ్మ దేవాలయం వద్ద బావిలో గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. మతిస్థిమితం లేకపోవడంతో పాటు తరుచూ మూర్ఛతో బాధపడుతుండేది. రెండు రోజుల క్రితం ఆలయం వద్దకు వెళ్లిన ఆమె ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెంది ఉంటుందనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి మృతి

లేపాక్షి: మండలంలోని కల్లూరు ఎస్సీ కాలనీకి చెందిన సందీప్(25) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఇటీవల చేపట్టిన నూతన గృహ నిర్మాణం వద్ద విద్యుత్ మోటారు మొరాయిస్తుండడంతో గురువారం పరిశీలిస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. కుటుంబసభ్యులు హిందూపురంలోని ఆస్పత్రికి తీసుకెళుతుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు.